క్లుప్తంగా

పేదలకు న్యాయం చేసేది కాంగ్రెస్సే

పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు జయమ్మ



సదస్సులో మాట్లాడుతున్న జయమ్మ

మంచాల: బడుగు, బలహీన వర్గాల ప్రజలకు న్యాయం చేసేది కాంగ్రెస్ పార్టేనని ఆ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గుండమోని జయమ్మ అన్నారు. సోమవారం శంషాబాద్‌లో పార్టీ ఆధ్వర్యంలో కులగణన సర్వే పై నిర్వహించిన సదస్సులో అమె మాట్లాడారు. సబ్బండ వర్గాలకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కిందన్నారు. చట్ట పరంగా పార్టీ.. బీసీలకు న్యాయం చేస్తుందన్నారు. పార్టీ శ్రేణులు కులగణన సర్వేలో భాగం కావాలని సూచించారు.

విద్యార్థికి సన్మానం



నిఖిల్‌ను సత్కరించిన పోలీసులు

ఆమనగల్లు: జాతీయ అర్హత పరీక్ష (నీట్)లో ప్రతిభ చూపిన విద్యార్థిని ఎస్ఐ వెంకటేశ్ ఘనంగా సన్మానించారు. మండల పరిధి మేడిగడ్డతండాకు చెందిన నిరుపేద విద్యార్థి వద్యావత్ నిఖిల్.. నీట్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. ఈ సందర్భంగా సోమవారం సదరు విద్యార్థిని ఆమనగల్లు పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ సత్కరించారు. కార్యక్రమంలో పోలీసులు, నాయకులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి ఆర్థిక సహాయం

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలోని బాట సింగారం రైతు సేవా సహకార సంఘం సభ్యుడు, అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన బూడిద శివ ఇటీవల మృతి చెందాడు. ఈ నేపథ్యంలో సంఘం తరఫున అందజేసే ఆర్థిక సాయం.. రూ.25 వేలను సోమవారం సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్.. కార్యాలయంలో మృతుడి భార్య భారతికి అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మహేందర్‌రెడ్డి, యాదిరెడ్డి, రాములు, మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ ఐలేష్ యాదవ్, నాయకులు జంగమయ్య తదితరులు పాల్గొన్నారు.

వాసవీ ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆమనగల్లు: కార్తీకమాసం సందర్భంగా సోమవారం పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా హోమం, లక్ష దీపారాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వీరబొమ్మ రామ్మోహన్, కార్యదర్శి బికుమాండ్ల నర్సింహ, కోశాధికారి శ్రీనివాస్, సభ్యులు లక్ష్మయ్య పాల్గొన్నారు.

గ్రామపంచాయతీకి ట్రాలీ వితరణ

ఇబ్రహీంపట్నం రూరల్: మాజీ సర్పంచ్ దాతృత్వం చాటుకున్నారు. తాను సర్పంచ్‌గా పని చేసిన గ్రామానికి పదవీ ముగిసినప్పటికీ సొంత ఖర్చులతో ట్రాలీని బహూకరించారు. ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బూడిద రాంరెడ్డి.. తన హయాంలో సొంత నిధులతో పాఠశాల భవనం, దేవాలయాల నిర్మాణం, ట్రాక్టర్‌ను అందజేశారు. పదవీ ముగిసినా గ్రామానికి సేవ చేస్తున్న మాజీ సర్పంచ్‌ను ప్రజలు అభినందించారు.

రేపు జాతర ఏర్పాట్లపై సమావేశం

మంచాల: ఆరుట్ల బుగ్గరామలింగేశ్వర స్వామి జాతర ఉత్సవాల గురించి సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బాల శంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6న మండల కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమీక్ష జరగనుందని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, డివిజన్, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

విగ్రహాల ఎదుట పరిశుభ్రత పాటించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి చింతపల్లిగూడ గేటు సమీపంలో గల మహనీయుల విగ్రహాల వద్ద చెత్తాచెదారం పేరుకుపోయిందని అశోక్ అన్నారు. శుభ్రం చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. చెత్తాచెదారంతో అంబేడ్కర్, జగ్జీవన్‌రావు విగ్రహాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నా.. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం ఆరోపించారు. అక్కడే ఉన్న బస్టాప్ కూడా చెత్త, పిచ్చి మొక్కలతో దర్శనమిస్తుందని పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రం చేయించాలన్నారు.

బిల్లులు అడిగితే నిర్బంధిస్తారా?



మంచాల: పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు



తలకొండపల్లిలో..

'ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోయినా.. ఆస్తులు అమ్ముకుని, అప్పులు చేసి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాం. ఏడాది కాలంగా బిల్లులు చెల్లించాలని కోరాము. అయినా ఇవ్వలేదు. పైగా అరెస్టులు చేయిస్తోంది. పల్లెలను అభివృద్ధి చేసినందుకు ఇదేనా ప్రభుత్వం మాకు ఇచ్చే బహుమానం' అని మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఇవ్వాల్సిన మొత్తం ఇచ్చిన తరువాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని, బిల్లులు ఇచ్చే వరకు పోరాటం చేస్తామని స్పష్టంచేస్తున్నారు.

- అక్రమ అరెస్టులు తగదు..
- మాజీ సర్పంచులకు రావాల్సిన మొత్తం చెల్లించాలి
- ఆ తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి
- సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: ప్రజాప్రతినిధులుగా సర్పంచులు వారి పాలన కాలంలో గ్రామాలకు చేసిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని అడిగితే అరెస్టులు చేయిస్తుందని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి విమర్శించారు. పెండింగ్ బిల్లుల సాధనకు సర్పంచ్‌ల సంఘం సోమవారం చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో మాజీ అధ్యక్షుడిని ముందస్తుగా పోలీసులు అదుపులోకి తీసుకుని గృహ నిర్బంధంలో ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్పంచులు వారివారి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశారని, కానీ చేసిన పనులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో అప్పుల పాలయ్యారని పేర్కొన్నారు. ఈ లోగా వారి పదవీ కాలం ముగిసిందని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా మాజీలకు రావాల్సిన రూ.1500 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల డిమండ్ చేశారు. బిల్లులు చెల్లించిన తర్వాతే.. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. అప్పటి వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు.



కడ్తాల్: లక్ష్మీనర్సింహారెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ముందస్తు అరెస్టులు

మంచాల: పెండింగ్ బిల్లుల సాధనలో భాగంగా నగరంలో నిర్వహించే పోరు బాట కార్యక్రమంలో పాల్గొనకుండా మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మధ్యాహ్నం వరకు పోలీస్ స్టేషన్‌లో ఉంచి వ్యక్తి గత పూచీకత్తుపై వదిలి పెట్టారు. అరెస్టు అయిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, మాజీ సర్పంచ్‌లు నాగరాజ్‌గౌడ్, జగన్‌రెడ్డి, బాలరాజు, రఘునాయక్, పార్టీ ఆరుట్ల అధ్యక్షుడు రాము ఉన్నారు.

వీధిన పడుతున్న కుటుంబాలు

తలకొండపల్లి: గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు అడిగితే అరెస్టు చేయడం ఎంత వరకు సమంజసమని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక మాజీ సభ్యుడు, మాజీ సర్పంచ్ బక్కి కుమార్ అన్నారు. పొలం, బంగారం, వాహనాలు తదితర ఆస్తులను అమ్ముకొని, ఆదర్శ గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్ది, సర్పంచ్‌లు అప్పులపాలయ్యారని పేర్కొన్నారు. బిల్లులు చెల్లించాలని ఏడాది కాలంగా కోరినా.. ప్రభుత్వం స్పందించలేదని ఆరోపించారు. బిల్లులు రాక, కుటుంబ పోషణ భారమై.. కుటుంబాలు వీధిన పడుతున్నాయని పేర్కొన్నారు. బిల్లులు చెల్లించాలని, లేని పక్షంలో ఆందోళనలు విస్తృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జ్యోతయ్య, కుమార్, రమేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు..

ఆమనగల్లు: చేసిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని అడిగితే ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయించిందని రాంనుంతల మాజీ సర్పంచ్ శ్రీనునాయక్ ఆరోపించారు. బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచ్‌లు నిరసనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో మండలంలోని పలువురు మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. వ్యక్తిగత పూచీకత్తుపై సాయంత్రం వదిలిపెట్టారు. అరెస్టు అయిన వారిలో.. సత్యం, శ్రీనయ్య, యాదయ్య తదితరులు ఉన్నారు.



పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు

రైతులను విస్మరించిన ప్రభుత్వం

- ధాన్యం చేతికొచ్చినా.. కొనుగోలు కేంద్రాలు లేవు
- జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు అనురాధ

ఆమనగల్లు: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను విస్మరించిందని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు అనురాధ విమర్శించారు. రైతులు పండించిన ధాన్యం చేతికొచ్చినా.. ఇంత వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేకపోయిందని ఆరోపించారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు తెచ్చిన ధాన్యాన్ని టీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆమె పరిశీలించారు. రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ధాన్య తెచ్చి రోజులు గడుస్తున్నా.. కొనుగోలు కేంద్రం ప్రారంభించలేదని, నిల్వ చేసుకోవడానికి సరైన వసతులు లేవని అన్నదాతలు ఆమె దృష్టికి తెచ్చారు. అనంతరం అనురాధ మాట్లాడారు. ధాన్యం చేతికి వచ్చినా, వాటిని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, మద్దతు ధరతో పాటు.. అదనంగా క్వింటాల్‌కు రూ.500 చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్, నాయకులు లాలయ్యగౌడ్, బాలస్వామి, రమేశ్‌నాయక్, వెంకటేశ్, శివకుమార్, యాదయ్య, ప్రసాద్, గణేశ్, ఆనంద్, మహేశ్, గణేశ్‌నాయక్ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న అనురాధ

వీవోఏలకు కనీస వేతనం చెల్లించాలి

సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య



ఏపీఎం శ్రీదేవికి వినతిపత్రం అందజేస్తున్న వీవోఏలు

తలకొండపల్లి: మహిళా సమాఖ్యలో పని చేస్తున్న వీవోఏలకు కనీస వేతనం నెలకు రూ.20 వేలు చెల్లించాలని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ జల్లెల పెంటయ్య డిమాండ్ చేశారు. తలకొండపల్లి మండల కేంద్రం మహిళా సమాఖ్య కార్యాలయ ప్రాంగణంలో సోమవారం పెంటయ్య ఆధ్వర్యంలో వీవోఏలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకేపీ వీవోఏలకు, గ్రామ సంఘాలకు స్త్రీ నిధి ఇంటెన్సివ్ విడుదల చేయాలన్నారు. ప్రతి గ్రామ సంఘానికి ఒక ట్యాబ్, నెట్ సౌకర్యం కల్పించాలని, రూ.20 లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా కల్పించాలని కోరారు. అనంతరం ఏపీఎం శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నర్సింహ, కోశాధికారి కృష్ణారెడ్డి, వీవోఏలు నరసింహ, స్వప్న, అరుణ, శశికళ, మంగమ్మ, యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పోరాడి సాధించుకుంటాం

జేఏసీ నాయకులు

తలకొండపల్లి: ఎంతవరకైనా పోరాడతాం.. గట్టుఇప్పలపల్లి మండలాన్ని సాధించుకుంటామని జేఏసీ చైర్మన్ మొక్కురాల అశోక్ గౌడ్ అన్నారు. గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలన్న డిమాండ్‌తో చేపట్టిన రిలే నిరహార దీక్షలు సోమవారానికి నాలుగో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడారు. గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని సుదీర్ఘ కాలంగా పోరాటం చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు రాష్ట్ర ప్రభుత్వం మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ ఎదుల శరత్‌చంద్ర, లక్క నాయక్, చంద్రు నాయక్, నరసింహ గౌడ్, నాగయ్య, రామయ్య, నర్సింహులు, బాలయ్య, షరీఫ్, మాణిక్య రెడ్డి, అనిల్, ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న జేఏసీ నాయకులు

విగ్రహావిష్కరణకు ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: కురుమ తెలంగాణ యువ చైతన్య సమితి ఆధ్వర్యంలో ఈ నెల 7న మునుగోడు నియోజవకర్గం కేంద్రంలో ప్రతిష్టించనున్న దొడ్డి కొమరయ్య విగ్రహావిష్కరణకు రావాలని, బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్‌ను సమితి సభ్యులు సోమవారం ఆహ్వానించారు.



మల్లేశ్‌ను ఆహ్వానిస్తున్న సమితి సభ్యులు

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కృష్ణారెడ్డి తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధి 23వ వార్డు లక్ష్మారెడ్డిపాలెం కాలనీలో రూ.20లక్షల వ్యయంతో సీసీరోడ్డు నిర్మాణ పనులకు కౌన్సిలర్ సిద్దంకి కృష్ణారెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు కోట్లాది రూపాయలు వెచ్చించి వార్డుల్లో సీసీరోడ్లు, భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైపులైన్లు వేశామని, మౌలిక వసతులు కల్పించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, మురళీధర్‌రెడ్డి, విద్యావి జయేందర్‌రెడ్డి, రాజేందర్ ముదిరాజ్, సాయిబృందావన్ ట్రస్ట్ చైర్మన్ నారాయణస్వామి, యూత్ కాంగ్రెస్ నాయకుడు నాగార్జున, లక్ష్మారెడ్డిపాలెం కాలనీ అధ్యక్షుడు గోవింద్‌రెడ్డి, స్థానికులు బాబురావు, శివాగౌడ్, మజీద్‌బాబా, శ్రీనాథ్‌రెడ్డి, సాయి, నరేందర్‌లు పాల్గొన్నారు.

కుల వృత్తులకు ప్రాధాన్యత ఇవ్వాలి

యాచారం: కుల వృత్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని, అన్ని పండుగలను గౌరవంగా జరుపుకోవాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు అన్నారు. పీఎస్ పరిధి కుర్మిద్ద గ్రామంలో ఆదివారం రాత్రి యాదవ యువజన సంఘం ఆధ్వర్యంలో సదర్ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో సదర్ ఉత్సవాలను జరుపుకోవడం అభినందనీయమన్నారు. అన్ని మతాలు, కులాలను గౌరవిస్తూ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ తేజంరెడ్డి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మండల కేంద్రం కల నెరవేరేనా?



ఇర్విన్ గ్రామ పంచాయతీ కార్యాలయం

- అటకెక్కిన ప్రకటనలు, ప్రతిపాదనలు
- సుదీర్ఘకాలంగా ఎదురు చూస్తున్న ఇర్విన్ వాసులు

మాడ్గుల: ఇర్విన్ మండల కేంద్రం ఏర్పాటుకు ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇర్విన్ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని పరిధి గ్రామాల ప్రజలు సుదీర్ఘ కాలంగా డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు నాటి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్.. జూలై 30, 2022న ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీంతో గత ప్రభుత్వం మాడ్గుల మండలాన్ని రెండు మండలాలుగా విభజిస్తూ.. ఇర్విన్ నూతన మండల కేంద్రంగా ఏర్పాటుకు జూన్ 28, 2023న నిర్ణయం తీసుకుంది. ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. అనంతరం ఇర్విన్, బ్రహ్మణపల్లి, ఆర్కపల్లి, అందుగుల, అన్నెబోయినపల్లి, సుద్దపల్లి, గిరికొత్తపల్లి, కలకోండ, రమణంపల్లి రెవెన్యూ గ్రామాల పరిధి 19 పంచాయతీలతో ఇర్విన్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదిస్తూ పక్షం రోజుల్లో అభ్యంతరాలు తెలపాలని కలెక్టర్ జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఆ తరువాత మండల కేంద్రం ఏర్పాటుపై ఎలాంటి సమాచారం, స్పష్టత లేకపోవడంతో ప్రాంత ప్రజలు అసహనం వ్యక్తంచేస్తున్నారు. అసలు మండల కేంద్రం ఏర్పాటు అవుతుందా లేదా అని అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ప్రజల కోరిక మేరకు ఇర్విన్ మండల కేంద్రం ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా

మంచాల: ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, డీఏలు చెల్లించాలని, పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేష్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు ఈ నెల 5న కలెక్టరేట్ ఎదుట శాంతియుత ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అధిక సంఖ్యలో టీచర్లు పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఇబ్రహీంపట్నం: డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఉదయం 11 గంటలకు ఇబ్రహీంపట్నంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రారంభించనున్నారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

ఒకపూట బడి, మరోపూట సర్వే

- కులగణను పకడ్బందీగా చేపట్టాలి
- ఎంపీడీఓలు శ్రీకాంత్, నరేందర్‌రెడ్డి
- ఇంటింటి కుటుంబ సర్వేపై శిక్షణ



యాచారం: శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

తలకొండపల్లి: ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ శ్రీకాంత్ అన్నారు. ఉదయం పూట పాఠశాలలు ముగిసిన తర్వాత, మధ్యాహ్నం నుంచి సర్వే చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సర్వేపై ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆశ, జీపీ కార్యదర్శులతో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓతో పాటు, తహసీల్దార్ నాగార్జున, ఎంఈఓ చాంప్లా నాయక్‌లు.. 75 అంశాలతో కూడిన ప్రశ్నావళిని ఏ విధంగా పూరించాలో, ఏయో ప్రశ్నలు అడిగి సమాచారం సేకరించాలో అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ఒక్కో ఎన్యూమరేటర్‌కు 150 ఫామ్‌లు ఇస్తామని, మూడు వారాల్లో సర్వే పూర్తి చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రవణ్, ఎమ్మార్సీ సిబ్బంది శ్రీశైలం, శేఖర్, ప్రవీణ్ కుమార్, మల్లయ్య, ఉపాధ్యాయులు, ఎన్యూమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పక్కగా చేద్దాం

యాచారం: సర్వేను పక్కాగా నిర్వహిద్దామని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 6వ తేదీ నుంచి నిర్వహించే కులగణనను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో ఇప్పటికే ప్రతి ఇంటికీ స్టిక్కర్లు వేశారని, ఎన్యూమరేటర్లకు కేటాయించిన ఇళ్లను సందర్శించి, కుటుంబ పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. సర్వేలో అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి శ్రీలత పాల్గొన్నారు.

క్షుణ్ణంగా పరిశీలించి..

మంచాల: కులగణన సర్వేను నిబంధనలకు అనుగుణంగా చేయాలని ఎంపీడీఓ బాల శంకర్ అన్నారు. మండల కార్యాలయంలో ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రభుత్వ శాఖల పరిధిలో పని చేసే అంగన్‌వాడీ టీచర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశ వర్కర్లు, వీఓఏలను కలుపుకొని ఉపాధ్యాయులు కూడా ఈ సర్వేలో పాల్గొన్నాలని తెలిపారు. సర్వేలో పేర్కొన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, సర్వే చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ఉషారాణి, ఎంఈఓ రాందాస్, ఎంపీఎస్ఓ పాండురంగారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తలకొండపల్లి: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీకాంత్

పక్కాగా పూర్తిచేయాలి

ఆమనగల్లు: కులగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ మాధురి అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సమగ్ర సర్వేపై ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల పక్కాగా చేపట్టాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి పూర్తి స్థాయిలో కుటుంబ సభ్యుల వివరాలు సేకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఆదిలక్ష్మి, తహసీల్దార్ లలిత, ఎంఈఓ పాండు తదితరులు పాల్గొన్నారు. రైతువేదికలో ఎన్యూమరేటర్లకు కమిషనర్ వసంత ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ మాధురి